**Jumua Ke Khutbe**
(Telugu)

# జుమా ప్రసంగాలు

మూలం:

మౌలానా అబూ సలీమ్ అబ్దుల్ హై (రహ్మలై)

అనువాదం:

అబుల్ ఇర్ఫాన్

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

# మా మాట

మౌలానా అబ్దుల్ హై రచించిన "జుమాకె ఖుత్బె" అనే పుస్తకాన్ని తెలుగు ప్రజలకు అందజేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

జుమా ప్రసంగం ఇస్లామీయ జీవితానికి ఊపిరివంటిది. దీని ద్వారా ప్రతి వారం విశ్వాసంలో ఉత్తేజం, నూతన శక్తి జనిస్తాయి. అనేక బలహీనతలు చోటుచేసుకున్న నేటి ముస్లిమ్ సమాజంలో ముస్లింలు జుమా ఖుత్బాల ఈ మహా భాగ్యానిక్కూడా దూర మయ్యారు. తత్ఫలితంగా జుమా ప్రసంగం కేవలం ఓ ఆచారంగా మాత్రమే మిగిలి పోయింది.

ఈ స్థితికి ఒక కారణం జుమా ప్రసంగాలలో ప్రయోగించే అరబీ భాష ముస్లిము లందరికి తెలియకపోవడం. అందువల్ల నేడు అనేక చోట్ల అరబీతోపాటు స్థానిక ప్రజల మాతృభాషలో కూడా జుమా ప్రసంగం చేయడం జరుగుతోంది. ఈ పుస్తకంలో మేము ఉర్దూ రాని మన రాష్ట్ర ప్రజల కోసమని జుమా ప్రసంగాలను అందజేస్తున్నాము.

ఈ ప్రసంగాలు జుమాలో వినిపింపగోరేవారు ప్రతి ప్రసంగానికి ముందు "ఖుత్బయే మస్నూన" (ప్రవక్త సంప్రదాయంలోని ఖుత్బా) పఠించాలి. "ఖుత్బయే సానియ" (ద్వితీయ ప్రసంగం) తమకు నచ్చినది పఠించవచ్చు. అయితే ఇది తప్పనిసరిగా అరబీలోనే ఉండాలి.

- ప్రకాశకులు

# రచయిత తొలిపలుకు

జుమా ప్రసంగం ఇస్లామీయ జీవితానికి ఆహారం వంటిదని అనడంలో తప్పులేదు. దీని ద్వారా ప్రతి వారం విశ్వాసానికి పదును, ఇస్లాంకు శక్తిని చేకూర్చే గొప్ప ఏర్పాటు చేయబడింది. అయితే ఇస్లామీయ వ్యవస్థ బలహీనపడ్డం వలన ఏ విధంగానైతే ముస్లిమ్ సమాజం అనేక వరప్రసాదాలకు దూరమయిందో, అదే విధంగా జుమా ప్రసంగాల శుభాలనూ కోల్పోయ్యారు. ఇప్పుడు మన జీవన వ్యవస్థలానే మన జుమా ప్రసంగాలు కూడా నిర్జీవమై, అవి ఒక మొక్కుబడిగా మాత్రం మిగిలాయి.

ఈ దుస్థితికి అనేక ఇతర కారాణాలతోపాటు ప్రసంగం వినేవారికి అరబీ భాష తెలియకపోవడం కూడా ఒక ముఖ్య కారణం. ఈ దృక్పథంతోనే కొంత మంది ఉర్దూలో ప్రసంగించడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ అవసరం మేరకే 'అల్ హస్‌నాత్' మాస పత్రికలో 'జుమా ప్రసంగాలు' పేరుతో ఒక శీర్షిక మొదలు పెట్టాము. ఈ జుమా ప్రసంగాలు ప్రజలకు నచ్చాయనీ, వీటిని జుమాల్లో వినిపించడం కూడా జరిగిందని తెలిసింది. ఈ ప్రసంగాలన్నింటినీ ఒక పుస్తక రూపంలో సంకలనం చెయ్యాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది.

'అల్ హస్‌నాత్' లోని ఈ ప్రసంగాల సంకలనాన్నే ఇప్పుడు ప్రచురిస్తున్నాము. 'ప్రసంగ భాష' అనే శీర్షికన ఒక వ్యాసం కూడా జత చేయబడింది. ఈ వ్యాసంలో ప్రసంగం ఏ భాషలో ఉండాలి, ఉర్దూలో ప్రసంగించే అవకాశం ఎంత మేరకు ఉంది అన్న విషయాలు చర్చించబడ్డాయి. ద్వితీయ ప్రసంగం అరబీలోనే ఉండాలి. ఈ అవసరం మేరకు పుస్తకం చివరన ద్వితీయ ప్రసంగం నిమిత్తం రెండు అరబీ ప్రసంగాలు కూడా ప్రచురించాము.

ఈ పుస్తకం సులువయిన భాషలో హితోపదేశానికి లాభదాయకం కాగలగాలని దైవాన్ని వేడుకుంటున్నాను.

- అబ్దుల్ హై

# ప్రసంగ భాష

జుమా నమాజుకు ముందు ఖుత్బా (ప్రసంగం) తప్పనిసరి. సాధారణంగా ఈ ప్రసంగం అరబీ భాషలో చదువుతారు. ఇది తప్పనిసరిగా అరబీలోనే ఉండాలనీ, అరబీయేతర భాషలో చదవడం ధర్మసమ్మతం కాదనీ చాలా మంది అభిప్రాయపడతారు. కాని కొంత మంది మాత్రం ఈ ప్రసంగం అసలు ఇస్లామియ ఆదేశాల వ్యాప్తికీ, ప్రజల విశ్వాసంలో పటిష్టత కలిగించడానికి, హితోపదేశం గరపడానికి సాధనమనీ అంటారు. వినేవారికి ఈ ప్రసంగం అర్థమైతేనే ఈ ఆశయాలు నెరవేరుతాయి. కాబట్టి శ్రోతలకు తెలిసిన భాషలోనే ఈ ప్రసంగం ఉండాలి అనేది వీరి వాదన.

అరబీయేతర భాషల్లో జుమా ప్రసంగం చేయడానికి వ్యతిరేకించేవారి వాదన ఏమంటే- జుమా ప్రసంగం నమాజులో ఓ భాగం. దీన్ని గనుక ఇతర భాషల్లో అనుమతిస్తే మున్ముందు ప్రజలు అర్థం చేసుకుని చదివేందుకు నమాజును కూడా మాతృభాషలో చదివేందుకు అనుమతి కావాలనే ప్రతిపాదనకు ఆస్కారం ఏర్పడుతుంది. నిస్సందేహంగా ఈ వాదనలో బలం ఉంది. 'జుమా ప్రసంగం నమాజులో ఓ భాగం' అనే విషయాన్ని ఒప్పుకుని, ప్రసంగాన్ని ఇతర భాషల్లో చేయడానికి అనుమతిస్తే నమాజును కూడా ఇతర భాషల్లో చెయ్యడం సరయినదనవచ్చు. 'నమాజును అరబీలోనే చదవాలి' అన్న విషయంలో అందరికీ ఏకాభిప్రాయం ఉంది. అసలు విషయం ఏమిటంటే ప్రసంగం నమాజులో భాగం ఎంత మాత్రం కాదు. కాని జుమా నమాజు నెరవేరడానికి అది తప్పనిసరయిన అంశం. నిస్సందేహంగా జుమా ప్రసంగం కూడా నమాజు లాంటి ఆరాధనాంశమే. కాని రెంటి ఆశయాలూ వేరయినవి, నమాజులో చదివింది కొంత మేరకు అర్థం చేసుకోలేకపోయినా కూడా నమాజు ఉద్దేశ్యం నెరవేరుతుంది. కాని ప్రసంగం ఉద్దేశ్యం వినేవారు దాన్ని అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే సిద్ధిస్తుంది. ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

మనిషి కేవలం వ్యక్తిగత స్థాయిలో సజ్జనుడుగా, సద్వర్తనుడుగా రూపొందడం, నీతిమంతుడయి, నిజాయితీపరుడయి భయభక్తుల జీవితం గడపడం మాత్రమే ఇస్లామ్ అసలు ఉద్దేశ్యం కాదని మనందరికీ తెలుసు. ఇస్లామ్, ఒక్కొక్క వ్యక్తిని సంస్కరించి, మంచి వ్యక్తిగా తీర్చిదిద్ది, అటువంటివారిని పరస్పరం చేరదీసి ఓ ఉన్నత ఆశయాల ఉత్తమ సంఘాన్ని స్థాపించగోరుతుంది. ఆ సమాజం భువిలో దైవ ప్రాతినిధ్యపు బాధ్యతల్ని సవ్యంగా నిర్వర్తించగలగాలని అభిలషిస్తుంది. అందువల్లనే ఇస్లామ్ ఆరాధనల్ని విధిగా నిర్ణయించింది. మనుషుల్లో అవి ఒక వైపు భయభక్తులు, పవిత్రతా గుణాలను సృజిస్తే, మరోవైపు వారిని ఒక ఉత్తమ సంఘంగా రూపొందడానికి సహకరిస్తాయి. వీటిలో అన్నిటికంటే ముఖ్యమయినది నమాజ్. అది మనిషిని నిష్ఠాగరిష్ఠునిగా, పరిశుద్ధుడుగా

తీర్చిదిద్దుతుంది. మనిషిని ఉత్తమునిగా మలచడానికి నమాజ్‌కు మించిన సాధనం మరొకటి లేదు. నమాజ్ ద్వారానే ఖుర్‌ఆన్ ఉపదేశాలు మాటిమాటికి ప్రజల ముందుకు వస్తాయి. ఇందులోనే ఖుర్‌ఆన్ రక్షణ ఇమిడిఉంది. నమాజ్ ముస్లిమ్‌లను సంఘటిత పరుస్తుంది. ఇక నమాజ్ అరబీయేతర భాషల్లో చేయడం గనుక సంభవిస్తే దైవ ప్రవక్త (సఅసం) స్వయంగా అందజేసిన ఉపదేశవాక్కులకు దూరమవుతారు. వాటికి ఉన్న ప్రత్యేకత కాస్తా కనుమరుగవుతుంది. అంతేగాక ఖుర్‌ఆన్‌ని వివిధ భాషల్లో పఠించడం వల్ల దాని రక్షణకు ముప్పువాటిల్లే ప్రమాదం కూడా ఉంది. వివిధ భాషల్లోని అనువాదాలనే ప్రజలు ఖుర్‌ఆన్‌గా భావిస్తారు. దాన్నే పారాయణం, ఆరాధనల కొరకు ఉపయోగించు కుంటారు. ఈ విధంగా 'అసలు ఖుర్‌ఆన్'తో వీరి సంబంధం తెగిపోతుంది. దాన్ని కంఠస్థం చేసే అభిరుచి, చదవే, చదివించే అవసరం అంతమయిపోతాయి, ఈ పరిస్థితి గనక జనిస్తే దాని ఫలితంగా ప్రజలు అసంపూర్ణమయిన, పరస్పరం విభిన్నమయిన అనువాదాలకు అసలయిన ఖుర్‌ఆన్ స్థాయిని కల్పిస్తారు. అంతేకాక వివిధజాతుల్లో, భాషావర్గాల్లో ఖుర్‌ఆన్ భావం, అర్థం రీత్యా విభిన్నమయిపోతుంది. క్రైస్తవుల ధర్మానికి, యూదుల ధర్మానికి పట్టిన గతి ముస్లిముల ధర్మానికి కూడా పట్టకుండా దైవం రక్షించుగాక! ఈ పరిస్థితి గనుక తటస్థిస్తే ప్రతి భాష మాట్లాడే వాళ్ళు తమ వేర్వేరు సంఘాలను స్థాపించుకుంటారు. ఇరానీయుడు అరబ్బు వెనుక నమాజ్ చెయ్యడు. సింధీ ముస్లిమ్ బెంగాలీకి దూరమవుతాడు, పంజాబీ, హిందీ మాట్లాడేవారు వేర్వేరుగా నమాజులు చేస్తారు. చైనీయులు, జర్మన్లు పరస్పరం వేరయిపోతారు.

నమాజ్ భాషా విభేదం ద్వారా ముక్కలవగానే ముస్లిమ్ అనుచర సంఘం కూడా తునాతునకలయిపోతుంది. అందుకు నమాజ్ విషయంలో మాత్రం యావత్ప్రపంచానికీ ఒకే భాష అవసరం. అందుకు అరబీ కంటే మేలయిన భాష మరొకటి లేదు. ఎందుకంటే, నమాజుకు అసలు శిక్షణ ఈ భాషలోనే ఇవ్వబడింది. ఈ భాషలోనే ఖుర్‌ఆన్ అవతరించింది. అర్థం కాకుండా నమాజ్ చేసేవారికి పూర్తి ప్రయోజనం చేకూరదనేది గొప్ప చిక్కు కాదు. నమాజులో చాలా భాగం మాటిమాటికీ చదివేదే. కాబట్టి దాని భావం గుర్తుంచుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఎవరయినా సరే ఆ పదాల భావార్థాన్ని సునాయాసంగా ఒకటి రెండు రోజుల్లో జ్ఞాపకం చేసుకోవచ్చు. నమాజ్‌లో సాధారణంగా చదవబడే సూరాల అర్థాన్ని కూడా సుమారు నెల రోజుల్లో మనోగతం చేసుకోవచ్చు. ఇకపోతే ఖుర్‌ఆన్‌లోని పెద్దపెద్ద సూరాల మాటయితే వాటి అర్థాన్ని ప్రజలందరూ అర్థం చేసుకోకపోతే నమాజ్‌లో వాటిల్లే నష్టమేమీ లేదు. నమాజును అరబీయేతర భాషల్లో చేస్తే సంభవించే ఘోర పరిణామాలతో పోలిస్తే అదేమంత పెద్ద లోపం కాదు.

ఈ విషయాలన్నింటినీ ముందుంచుకొని ఆలోచిస్తే 'నమాజు కూడా అరబీయేతర భాషల్లో చేయవచ్చు' అనే నిర్ణయం ఎంత ఘోరమయిన పొరపాటో స్పష్టమవుతుంది.

ప్రసంగం విషయం వేరు. ప్రసంగం, నమాజు ఈ రెండింటి ఉద్దేశ్యాల్లో వ్యత్యాసం ఉంది. మనిషి తాను చదివింది పూర్తిగా అర్థం చేసుకోకపోయినా నమాజు ఉద్దేశ్యం నెరవేరుతుంది. కాని ప్రసంగం పూర్తిగా అర్థం కానంతవరకు దాని ఉద్దేశ్యం నెరవేరదు. నమాజు కోసం లేచినప్పుడు మనిషి నమాజు తనపై దైవం మోపిన విధి అనీ, తాను ఆ విధిని నెరవేర్చేందుకు లేస్తున్నానని అనుకుంటాడు. అతను నమాజులోని అంశాలన్నీ నియమానుసారంగా పూర్తిచేస్తాడు. ఈ ఆచరణ ద్వారా అతను, 'నా విషయాలన్నీ నా ప్రభువుకు తెలుసు. ఆయన నన్ను గమనిస్తున్నాడు' అనే భావాన్ని ప్రకటిస్తాడు. తాను చేతులు కట్టుకుని నిలబడడం, శిరస్సు వంచడం, నుదుటిని నేలపై ఆన్చడం తన ప్రభువు కోసమేననీ, తాను ప్రభువునే ఆరాధిస్తున్నాడనీ, ఆయన తప్ప ఆరాధనకు అర్హులెవరూ లేరనీ మనిషికి తెలుసు. ఈ ఆచరణ ఫలితంగా నమాజు విధిగా చేయబడిన ఉద్దేశ్యం సిద్ధిస్తుంది. అందుకే నమాజుల్లో చదివేదంతా తప్పనిసరిగా అర్థం కావాలన్న కట్టడి మాత్రం లేదు. ఇక వాంఛనీయం ఏమిటీ, ఘనత దేనికి ఉందని ఆలోచిస్తే నమాజులో చదివే సూరాల భావం అర్థం చేసుకోవడం ఏమంత కష్టమయిన పని కాదు. కొద్దిపాటి ఆసక్తి కనబరిస్తే చాలు- అంతా మననం చేసుకోవచ్చు.

దీనికి భిన్నంగా ప్రసంగం వ్యవహారం పూర్తిగా వేరయినది. ప్రసంగం ఒక ఆరాధనాంశం, దైవసంస్మరణ మాత్రమే కాదు. ఒకవేళ ప్రసంగం ఉద్దేశ్యం దైవ సంస్మరణమే అయినట్లయితే దాని కోసం నమాజ్ ఒక్కటే సరిపోయేది. పైగా నమాజ్ దైవ సంస్మరణ విధానాలన్నింటిలో ఉత్తమమయిన విధానం కూడా. మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం)గాని, ఆయన తర్వాత ఆయన అనుచరులుగాని ప్రసంగం లేకుండా జుమా నమాజు చేయలేదన్న సంగతి అందరికీ విదితమే. అందుకే ముస్లిమ్‌లందరూ ప్రసంగాన్ని జుమా నమాజుకు తప్పనిసరి షరతుగా పరిగణిస్తారు.

ప్రవక్త (సఅసం) ఆయన అనుచర వర్గం ఇచ్చిన జుమా ప్రసంగాలలో చాలా భాగం నేటికీ భద్రంగా ఉన్నాయి. వాటిలో కేవలం దైవస్తోత్రం మాత్రమే కాకుండా విశ్వాసాన్ని, దైవభీతిని పెంచేందుకు ప్రయత్నం, షరీఅత్‌కు సంబంధించిన ఆదేశాలు, సద్బుద్ధికి సత్కార్యాలకు ఉపదేశం, చెడు విషయాలకు దూరంగా ఉండేందుకు హితబోధ, వ్యక్తిగత, సామూహిక విషయాలకై శ్రద్ధ మొదలగు విషయాలు కూడా ప్రస్తావించబడేవి. ఈ ఉద్దేశ్యాలన్నీ అరబీ భాషలో ప్రసంగించి సాధించడం అలవికాని పని. పూర్వం పాలనాధికారం ముస్లిమ్‌ల చేతుల్లో ఉన్నప్పుడు అరబీ భాషకు ప్రోత్సాహం లభించేది. తత్ఫలితంగా అరబ్బేతర ముస్లిమ్ దేశాల్లో కూడా చాలా మంది అరబీని అర్థం చేసుకోగలిగేవారు. ప్రసంగం అరబీలో వినిపించినా దాని ఉద్దేశ్యం నెరవేరడంలో పెద్ద ఇబ్బంది ఏమీ కలిగేది కాదు. కాని ప్రస్తుత పరిస్థితివేరు. ప్రస్తుత పరిస్థితిలో అరబీ ప్రసంగం ద్వారా దైవ స్తోత్రం, దైవ నామ సంకీర్తనాల ఆశయాలను మినహాయించి ఇతర ఆశయాలేవీ నెరవేరజాలవు.

ప్రసంగం సరియైన పంథాలో ఇచ్చి షరీఅత్ కోరినదాని ప్రకారం దాని ద్వారా ప్రయోజనాలు సాధించడానికి కృషి జరిపితే ఇది ముస్లిమ్ సమాజ పటిష్ఠతకు సర్వోత్కృష్ట మార్గం కాగలదు. దీని ద్వారా ప్రజల్లో విశ్వాసబలాన్ని జనింపజేయవచ్చు. వారిలో దైవభీతి, పరలోక భీతి భావనలు కలిగించవచ్చు; వారిలోని వ్యక్తిగత, సామూహిక బలహీనతలను దూరం చేయవచ్చు. వారి నీతిని, నిజాయితీని చక్కదిద్దవచ్చు.వారిలో ప్రబలి ఉన్న దురాచారాలను సంస్కరించవచ్చు. ఇంకా వారిని తమ తమ సంబంధీకుల ధార్మిక శిక్షణకూ, సంస్కరణకూ పురికొల్పవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతీ వారం ఇస్లామీయ సమాజ జీవనానికి కొత్త ఊపిరి పోయవచ్చు. అయితే ఈ ప్రయోజనాలన్నీ ప్రసంగాన్ని వినేవారు అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే ఒనగూడుతాయి. లేకపోతే ఈ ప్రయోజనాలు ఏ విధంగానూ కలిగే ఆస్కారం లేదు.

ఒక వైపు మన ముందు ఈ ఆశయాలు (జుమా ప్రసంగం ఆశయాలు) ఉన్నాయి. మరో వైపు ముస్లిమ్‌లను జుమా ప్రసంగం తప్పనిసరిగా అరబీలోనే ఉండాలన్న ఆదేశం ఎక్కడా కానరాదు, కాబట్టి జుమా ప్రసంగం శ్రోతలు అర్థం చేసుకోగలిగే భాషలో ఉండాలనే వారి వాదనలో తప్పు పట్టలేము. అది అధర్మమూ కాదు, అన్యాయమూ కాదు. పైగా జుమా ప్రసంగం ఆశయాల సాధనకోసం ఉత్తమ విధానం అని చెప్పవచ్చు.

అరబీయేతర భాషలో ప్రసంగించడాన్ని వ్యతిరేకించేవారు చూపే మరో గమనార్హమయిన అంశం ఏమంటే- 'జుమా ముస్లిమ్ సమాజాన్ని సంఘటితపరచడానికి ఒక సాధనం. వేర్వేరు భాషలు మాట్లాడేవాళ్ళు వేర్వేరు భాషల్లో చేసే ప్రసంగాల ఆధారంగా జుమా ప్రార్థన కూడా వేర్వేరుగానే ఏర్పాటు చేసుకుంటారు. అది ఇస్లామీయ సామూహిక తత్వానికి వ్యతిరేకమయిందే. దీన్ని వారించడానికి ఈ ప్రసంగం అరబీలో చెయ్యడమే ఉత్తమం' - అయితే ఈ సమస్యకు పరిష్కారం లేకపోలేదు. మొదటి పరిష్కారం ఏమిటంటే వివిధ భాషలు మాట్లాడేవాళ్ళు ఒకేచోట జుమా నమాజు చేసే పరిస్థితిలో ప్రసంగం అరబీ లోనే ఉండాలి. ఉదాహరణకు హజ్‌లో వివిధ భాషలు మాట్లాడే ముస్లిమ్‌లు ఒకే చోట జుమా నమాజు చేస్తారు. అయితే ఏదో ఒక అరబీయేతర భాష తెలిసినవారధికంగా ఉండే చోట, మరికొంత మంది అధిక సంఖ్యాకుల భాష తెలియనివారూ ఉన్నపక్షంలో మొదటి ప్రసంగాన్ని రెండు భాగాలుగా విభజించాలి. ఒక భాగం మాత్రం తప్పనిసరిగా అరబీలోనే ఉండాలి. అందులో దైవస్తోత్రం, దైవప్రవక్త (సఅసం), ఆయన సంతానం, సహచరవర్గంపై దరూద్ సలాంలు ఇంకా ఖుర్ఆన్ ఆయత్‌లు ఉండాలి. మరో భాగం శ్రోతల్లోని అత్యధికులు అర్థం చేసుకునే భాషలో ఉండాలి. అందులో షరీఅత్ ఆదేశాలు, నైతిక హితబోధలు, వ్యవహారాన్ని చక్కబరచుకునేందుకు ఉపదేశాలు, విశ్వాసాన్ని పటిష్టపరిచే సదాచరణకు పురిగొల్పే విషయాలు ఇంకా ఇతరత్రా సమస్యలపై చర్చలు ఉండాలి. ఇక ద్వితీయ ప్రసంగం విషయానికొస్తే అది మాత్రం తప్పనిసరిగా పూర్తిగా అరబీలోనే ఉండాలి.

ఈ విధానం వలన ప్రసంగం ద్వారా ఆశించిన ప్రయోజనాలు ఒనగూడటమేకాక శ్రోతల్లోని అధికుల భాషను అర్థం చేసుకోలేని వారికి, తప్పనిసరిగా అరబీ ప్రసంగమే చెయ్యాలనేవారికీ తృప్తి కలుగుతుంది.

మనదేశం విషయానికొస్తే ఉర్దూ భాషను ఇక్కడి సామాన్య ప్రజలు సులభంగా అర్థం చేసుకోగలరు. దీన్ని దేశంలో దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ అర్థం చేసుకుంటారు. అందుకే ప్రతి చోట స్థానిక భాషలో ప్రసంగం ఉండాలని పట్టుబట్టే బదులు ఉర్దూ అర్థమయ్యే చోటల్లా ఉర్దూలో ప్రసంగం ఏర్పాటు చేయడం మంచిది. కాని అవసరం మేరకు స్థానిక భాషల్లో ప్రసంగించడంలో తప్పులేదు.

ఉర్దూ భాషలో ప్రసంగాన్ని సర్వసామాన్యం చేసే పరిస్థితిలో కొన్ని జాగ్రత్తలు కూడా పాటించవలసి ఉంటుంది. ఈ జాగ్రత్తలు పాటించకపోతే ఉర్దూ ప్రసంగాల వల్ల లాభానికి బదులు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

మొట్టమొదటి విషయం ఏమిటంటే ఉర్దూలో ప్రసంగించే బాధ్యతను యోగ్యతలేని ఇమాములకు అప్పగించరాదు. దురదృష్టకరమయిన విషయం ఏమిటంటే, ఈరోజుల్లో సాధారణంగా ప్రాపంచిక పనుల్లో దేనికి పనికిరానివాణ్ణి, తక్కువ జీతానికి ఇమామత్‌ను వృత్తిగా స్వీకరించేవాణ్ణి మనం ఇమామ్‌గా నియమిస్తున్నాం. అసలు విద్య, దైవభీతి, భక్తిపరాయణతల ప్రాతిపదికలపై మనలో మేలయిన సమాజంలో మంచి స్థానంగల వ్యక్తిని ఇమామ్‌గా నియమించాలి. అతని మాటకు ప్రజల్లో విలువ ఉండాలి. చాలా చోట్ల పరిస్థితి ఇలా లేదు. ఈ పరిస్థితుల్లో వృత్తిగా చేసే ఇమాములు మనకు ప్రాపంచిక విషయాల్లోనూ, పారలౌకిక విషయాల్లోనూ మార్గదర్శకం కాగలరని ఆశించలేము, పరిస్థితుల దృష్ట్యా ఇమామ్‌లకు జాగ్రత్తగా రచించిన ప్రసంగం పాఠాలనయినా అందజెయ్యాలి. లేకపోతే అరబీ ప్రసంగంతోనయినా సంతృప్తి చెందాలి.

జాగ్రత్త వహించాల్సిన రెండవ విషయం ఇంకా సున్నితమయినది. అందరికీ అర్థమయ్యే సాధారణ భాషలో జుమా ప్రసంగాలు కావాలంటే ప్రజల దృష్టి ధర్మ జ్ఞానులపై (ఉలమాలపై) పడుతుంది. కాని దురదృష్టవశాత్తు ఈ విషయంలో కొంతమంది తప్ప మిగతావారి పరిస్థితిని ప్రస్తావించడానికి కూడా సిగ్గుపడవలసి వస్తుంది. వీరికి తమ ఇష్టప్రకారం మస్జిద్‌లలో ప్రసంగాలనిచ్చే అవకాశం గనక లభించినట్లయితే ప్రతిరోజా మస్జిద్‌లలో సిగపట్లు మొదలవుతాయి. ప్రజలు నమాజంటేనే విసుగెత్తిపోయే ప్రమాదమూ లేకపోలేదు. ఈ పండితుల్లో ప్రతి ఒక్కడూ తన ప్రత్యేక ధర్మపంథా (మస్‌లక్) గలవాడే. ఆ విషయంలో అతను ఎంత కఠినంగా ఉంటాడంటే- అతని దృష్టిలో ధర్మం మొత్తం తాను పట్టుపట్టే చిన్నచిన్న అప్రముఖమైన విషయాల్లోనేవుంది. షరీఅత్ బద్ధంగానే అతని పంథాను వ్యతిరేకించేవారిని ససేమిరా సహించడు; వారికి ఎలాంటి సడలింపునయినా ఇవ్వడం ఘోర పాపం అనుకుంటాడు. సాధారణంగా వీరికి శిక్షణ ఎలా ఇవ్వబడుతుందంటే-

వీరి సంకుచిత దృష్టి ఈ విషయాలను దాటి ముస్లిమ్ సమాజం ఎదుర్కొంటున్న జటిల సమస్యలపైకి పోనేపోదు. వీరి ఆసక్తి అంతా చిన్న చిన్న విభేదాలపైనే కేంద్రీకృతమయి ఉంటుంది. అందుకే నోరు విప్పినప్పుడల్లా వీరు ఆ విషయాల గురించే మాట్లాడతారు. సాధారణ ప్రజల ధార్మిక సంస్కరణ, నైతిక శిక్షణ, వ్యవహారాల దిద్దుబాట్లకు ప్రాధాన్యతనివ్వరు వీరు. ప్రజలు నూటికి నూరు శాతం తమతో ఏకీభవించాలని మాత్రమే వీరు కోరుకుంటారు. ప్రజల వ్యవహారాలు ఎలా ఉన్నాయి, నైతికత ఎలా ఉంది, ధార్మిక సదాచరణలపై ప్రజల మొగ్గు ఏ మాత్రం ఉంది అనే విషయాలను వీరు పట్టించుకోరు. అయోగ్యులయిన ఈ వర్గం వారికి అర్థమయ్యే భాషలో తమ జుమా ప్రసంగాలనిచ్చే స్వేచ్ఛ గనక ఇచ్చినట్లయితే వీరు పైన పేర్కొన్న చెడుల్లో ప్రజల్ని తలమునకలు చేసి మస్జిద్‌కు బయట కొట్లాటల్లో పడవేసే ప్రమాదం ఉంది.

జాగ్రత్తపడవలసిన మూడో విషయం ఏమంటే- కొంత మంది స్వార్థపరులు ఈ అవకాశాన్ని ఆసరాగా తీసుకుని తమ తమ రాజకీయ ప్రయోజనాల్ని సాధించుకోవడానికి, తమ ప్రాంతాలకు ప్రాబల్యాన్ని సంపాదించడానికి ప్రయత్నం చేస్తారు. దైవ గృహంలో పరస్పరం కలసిపోవడానికి వచ్చినవారిని కూడా విడదీయచూస్తారు.

ఈ సమస్యలన్నింటికి పరిష్కారం ఏమిటంటే- అతి జాగ్రత్తగా వ్యవహరించి అన్ని విషయాల్లోనూ సముచితంగా మెలగుతారన్న పూర్తి నమ్మకం కలవారికి తప్ప ఇతరులకు ఉర్దూలో ప్రసంగించే అవకాశం ఇవ్వరాదు. ఇదిగనక సాధ్యపడకపోతే ఘర్షణలకు, అభిప్రాయ భేదాలకూ అతీతంగా ఉండే మేలయిన ప్రసంగాలను వ్రాయించాలి. ఈ ప్రసంగాల ఆశయం ముస్లిమ్‌ల జీవితంలో మంచి ధార్మిక భావనను సృజించడం తప్ప మరొకటి కారాదు. ఈ ప్రసంగాల్లో సామాన్య నైతిక రుగ్మతలను రూపుమాపడానికి, ముస్లిమ్‌ల వ్యవహారాలు చక్కబరచడానికి వారిలో దైవభీతి, పరలోక భీతి కలిగించడానికి ప్రయత్నం జరగాలి. ఇంకా విశ్వాసం రీత్యా ఉత్తేజాన్ని కలిగించడానికి, సదాచరణ వైపునకు మరలించడానికి కృషిజరగాలి. అంతకు మించి వీటిలో ఏ రాజకీయ, మతపరమయిన ప్రత్యేక పంథాల బోధనగాని, ఒక వర్గం లేక ఒక పార్టీ ప్రచారంగాని ఉండరాదు.

అసలు ఈ పని ఎంతో ముఖ్యమయినది. విద్యాధికులైన వారే దీన్ని చేపట్టవలసింది. వారు ఏకాభిప్రాయంతో కృషి చేసి వివిధ రంగాలకు సంబంధించిన వివాదాస్పదంకాని జుమా ప్రసంగాల్ని ప్రజలు నిస్సంకోచంగా అంగీకరించేటట్లుగా రచించాలి. కాని అలాంటి అవకాశం ఎప్పుడు వస్తుందో చెప్పలేం. కాబట్టి 'అల్ హసనాత్' ద్వారా అప్పుడప్పుడు ఇలాంటి ప్రసంగాలు ప్రచురించాము. ఇప్పటివరకూ ప్రచురిస్తూవచ్చిన ఈ ప్రసంగాలు ప్రజల హితోపదేశానికి, ధార్మిక బోధనలకూ లాభదాయకం కాగలిగాయి. ఈ ప్రసంగాలు జుమాలలో కూడా చదివారు. ప్రజలు వీటి ద్వారా ప్రయోజనం కూడా పొందారు. అందుకే ఇప్పటివరకు వ్రాసినదంతా సంకలనం చేసి పుస్తకరూపంలో ఇప్పుడు మీ ముందుంచుతున్నాము.

# విషయ సూచిక


| అధ్యాయం | | | పేజీ |
|---|---|---|---|
| 1. | సంకల్ప శుద్ధి | ...... | 1 |
| 2. | పాపానికి నిష్కృతి పశ్చాత్తాపమే | ...... | 4 |
| 3. | సహనం సజ్జనుల సొత్తు | ...... | 8 |
| 4. | ఓర్మి కలవారే విజేతలు | ...... | 11 |
| 5. | కృతజ్ఞత లేనివాడు కృతార్థుడు కాలేడు | ...... | 15 |
| 6. | సత్యానికి మించిన సద్గుణం లేదు | ...... | 19 |
| 7. | విశ్వాసానికి గీటురాయి ఆచరణే | ...... | 23 |
| 8. | విశ్వాస బలమే విజయానికి నాంది | ...... | 27 |
| 9. | సహృదయాలే సత్యామృతాన్ని ఆస్వాదిస్తాయి | ...... | 30 |
| 10. | మరణాన్ని మరిచే మానవులకు మోక్షం లేదు | ...... | 34 |
| 11. | అంతిమ దైవ గ్రంథం | ...... | 38 |
| 12. | అగుపించని శత్రువు పట్ల అప్రమత్తంగా ఉండాలి | ...... | 41 |
| 13. | నైతిక రుగ్మతలకు నివారణోపాయం - నమాజ్ | ...... | 45 |
| 14. | సమాజ శ్రేయస్సుకై జకాత్ ఆవశ్యకత | ...... | 49 |
| 15. | దేవునితో మన ఒప్పందం | ...... | 53 |
| 16. | దైవానికి, దాసునికి మధ్య వ్యాపార ఒప్పందం | ...... | 57 |
| 17. | మంచిని పెంచు, చెడును త్రుంచు | ...... | 61 |
| 18. | ధర్మ సేవకై దూరదృష్టి ఆవశ్యకత | ...... | 65 |
| 19. | ప్రభావం | ...... | 69 |
| 20. | సామూహిక జీవితం | ...... | 72 |
| 21. | ప్రచార కార్యంలో ప్రథమ కర్తవ్యం | ...... | 76 |
| 22. | ముండ్లబాటపై నడిస్తేనే పూలపాన్పు లభిస్తుంది | ...... | 80 |
| 23. | పరీక్షా ఘడియలు | ...... | 84 |
| 24. | మానవ చరిత్రగతిని మార్చిన మహా విప్లవం | ...... | 88 |
| 25. | నైతిక రుగ్మతలు | ...... | 92 |
| 26. | అమానత్ | ...... | 96 |
| 27. | ధన వ్యామోహం | ...... | 100 |
| 28. | గౌరవాభిమానాల కొలమానం | ...... | 104 |
| 29. | జుమా నమాజ్ ప్రాముఖ్యత | ...... | 107 |
| 30. | వరాల వసంతం-1 | ...... | 111 |

| | | | |
|---|---|---|---|
| 31. | వరాల వసంతం-2 | ....... | 115 |
| 32. | వరాల వసంతం-3 | ....... | 118 |
| 33. | వరాల వసంతం-4 | ....... | 121 |
| 34. | సంపూర్ణ విప్లవమే సమస్యలకు పరిష్కారం | ....... | 124 |
| 35. | సత్యానికి ప్రతిరూపం సౌశీల్యం | ....... | 127 |
| 36. | పొరుగు వారి హక్కులు | ....... | 132 |
| 37. | షిర్క్ - ఓ ఘోర అత్యాచారం | ....... | 136 |
| 38. | మనిషిని మానవుడిగా తీర్చిదిద్దే పరలోక విశ్వాసం | ....... | 139 |
| 39. | ప్రజలకు ధర్మాన్ని పరిచయం చెయ్యడం మనందరి కర్తవ్యం | | 143 |
| 40. | నిజమయిన సాఫల్యం | ....... | 146 |
| 41. | కష్ట సుఖాలు | ....... | 149 |
| 42. | మానవ సమానత్వం | ....... | 153 |
| 43. | అల్లాహ్ గుణగణాలకు ఆయన పేర్లే దర్పణాలు | ....... | 157 |
| 44. | అమానత్ మోపే బాధ్యతలు | ....... | 160 |
| 45. | ప్రయత్నం మన విధి, ఫలితం దైవాధీనం | ....... | 163 |
| 46. | సమాజ సంస్కరణకు మూలమంత్రం | ....... | 166 |
| 47. | బాధ్యతల విస్మరణే అశాంతికి కారణం | ....... | 170 |
| 48. | సత్య సంధతే సకల సత్కార్యాలకు మూలం | ....... | 174 |
| 49. | దేవుని వాగ్దానం | ....... | 177 |
| 50. | దైవ సహాయం ఎలా లభిస్తుంది? | ....... | 181 |
| 51. | ఈమాన్ అంటే ఏమిటి? | ....... | 185 |
| 52. | ఖుర్ఆన్ పట్ల మన బాధ్యతలు-1 | ....... | 189 |
| 53. | ఖుర్ఆన్ పట్ల మన బాధ్యతలు-2 | ....... | 193 |
| 54. | ఖుర్ఆన్ పట్ల మన బాధ్యతలు-3 | ....... | 197 |
| 55. | మహా ప్రవక్త వ్యక్తిత్వం మానవాళికి వరప్రసాదం | ....... | 201 |
| 56. | భయం - దాని నివారణోపాయం | ....... | 205 |
| 57. | కృతజ్ఞతా భావం | ....... | 209 |
| 58. | ప్రదర్శనాబుద్ధి అతి ప్రమాదకరమైనది | ....... | 213 |
| 59. | దేవుని గుణగణాలు | ....... | 217 |
| 60. | ఈదుల్ ఫిత్ర్ ప్రసంగం | ....... | 221 |
| 61. | ఈదుల్ అజ్హా ప్రసంగం | ....... | 228 |
| 62. | నికాహ్ ప్రసంగం | ....... | 235 |

అనంత కరుణామయుడు అపారకృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# 1. సంకల్ప శుద్ధి

మహాశయులారా!

సాధారణంగా బాహ్య స్వరూపం రీత్యా ఇద్దరు వ్యక్తుల పనులు ఒకే విధంగా ఉంటాయి. కాని పరలోకంలో లభించే ఫలితాన్ని బట్టి వాటిలో చాలా తేడా ఉంటుంది. మీ కళ్ళెదుట ఇద్దరు వ్యక్తులు ఒకే విధమైన సత్కార్యం చేస్తున్నట్లు కనిపించడం సాధ్యమే. ఉదాహరణకు ఆ ఇరువురు చెరొక బావిని త్రవ్వించారు. కాని వారిలో ఒకతనికి పరలోకంలో తాను చేసిన పనికి సత్ఫలితం లభిస్తే, మరొకనికి ఏమీ లభించదు. ఎందుకని?

పరలోకంలో మనిషికి లభించే ప్రతిఫలం అతని సంకల్పంపై ఆధారపడి ఉంటుంది. సంకల్పం బాగుంటే అతనికి తన సత్కర్మల పుణ్యఫలం లభిస్తుంది. లేకపోతే పుణ్యఫలం లభించదు. ఏ పనయినా దేవుని ప్రీతి కోసం, అదీ ఆయన చూపిన పద్ధతి ప్రకారం చేస్తే పరలోకంలో దాని ప్రతిఫలం లభిస్తుంది. అయితే సత్కార్యం వెనుక దైవప్రీతికి బదులుగా మరొక ఉద్దేశ్యం ఉంటే పరలోకంలో దానికి ఎలాంటి విలువా ఉండదు. ఒక వ్యక్తి కేవలం పేరు ప్రతిష్ఠల కోసమని, తనను అందరూ మంచి వాడిగా భావించాలని బావిని త్రవ్విస్తే ఇంకా ఆ పేరు ప్రతిష్ఠల కారణంగా అతనేదయినా లాభం పొందగోరితే అలాంటి వ్యక్తికి పరలోకంలో అతను చేసిన ఆ పనికి ప్రతిఫలం లభించకూడదు. దేనికోసమయితే అతను పని చేశాడో అదే అతనికి లభించాలి. ఇదే న్యాయం కూడా. అయితే మరొక వ్యక్తి దైవం తనకు సిరిసంపదలు ప్రసాదించినందుకు కృతజ్ఞతగా బావిని త్రవ్విస్తాడు. ఈ సత్కార్యం వల్ల తన ప్రభువు సంతోషించాలని కోరుకుంటాడు. ఇంకా ఈ బావి వల్ల ప్రజలు కొంతకాలం వరకు ప్రయోజనం పొందా లని ఆశిస్తాడు. అలాంటప్పుడు అతనికి పరలోకంలో దాని ప్రతిఫలం తప్పనిసరిగా దొరకాలి.

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజిఅన్) ఉల్లేఖించిన ఒక హదీసులో మహాప్రవక్త (సఅసం), "కర్మలు మనోసంకల్పంపై ఆధారపడి ఉంటాయి. మనిషికి తాను సంకల్పించిన వస్తువే ప్రాప్తమవుతుంది" అని తెలిపారు. అదే హదీసులో దైవప్రవక్త (సఅసం) ఈ విషయంపై వ్యాఖ్యానిస్తూ, "ఎవరయితే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కోసం హిజ్రత్ చేస్తారో వారి హిజ్రత్ మాత్రమే నిజమయినది. ఎవరయితే ప్రాపంచిక సిరిసంపదల కోసం, లేదా ఒక స్త్రీతో వివాహమాడటానికి హిజ్రత్ చేస్తారో వారి హిజ్రత్ ప్రపంచం కోసమో లేక ఒక స్త్రీ కోసమో చేసిన హిజ్రత్‌గా పరిగణించబడుతుంది" అని సెలవిచ్చారు.

సోదరులారా!

ఇస్లామ్ దృష్టిలో 'హిజ్రత్' ఓ గొప్ప ఆరాధన, పుణ్యకార్యమని మీ అందరికీ తెలుసు. అయితే పుణ్యం లభించాలని, దైవప్రీతి పొందాలని చేసినప్పుడే హిజ్రత్ వల్ల పుణ్య ఫలం లభిస్తుంది. ఒకవేళ హిజ్రత్ చేసేటప్పుడు సయితం సంకల్పంలో ఏదయినా చెడు ఉద్దేశ్యం కలిగితే దానికి ఎలాంటి విలువ లేదు. ఉదాహరణకు - ఈ విధంగా తన దేశం వదలి పరదేశానికి పోతే అక్కడ తన వ్యాపారం బాగా వృద్ధి పొందు తుందని, లేదా అక్కడికి చేరిన తరువాత ఫలానా స్త్రీని వివాహమాడవచ్చునని, లేదా అలాంటిదే మరేదయినా ప్రయోజనం పొందవచ్చునని అనుకుంటే అలాంటి వ్యక్తి చేసిన హిజ్రత్‌కు దేవుని దృష్టిలో ఎటువంటి విలువలేదని మహాప్రవక్త (సఅసం) అన్నారు.

ఈ విషయాన్ని గురించి దివ్యఖుర్‌ఆన్, హదీసుల్లో స్పష్టంగా వివరించబడింది. ప్రతి సత్కార్యం చేసే ముందు మనిషి తన సంకల్పం పట్ల శ్రద్ధ వహించాలని నొక్కి చెప్పబడింది. ఒకసారి మహాప్రవక్త (సఅసం) "అల్లాహ్ మీ రూపురేఖల్ని, మీ సిరిసంపదల్ని పరిశీలించడు, ఆయన మీ అంతర్యాన్ని, మీ ఆచరణను (మాత్రమే) గమనిస్తాడు" అని ప్రవచించారు.

సోదరులారా!

ఇది ఎంతో సున్నితమయిన అంశం. మనం దీన్ని గురించి చాలా శ్రద్ధ తీసుకోవాలి. మీరెన్ని సత్కార్యాలు చేసినా మీకు సంకల్ప శుద్ధి లేకపోతే మీరు చేసిన దంతా వృధా అవుతుంది. ఈ విధంగా మీరేది కోల్పోతారో ఆలోచించండి. దురదృష్ట కరమయిన ఓ రైతు విషయం వినండి: అతను ఎంతో శ్రమపడి భూమిని దున్నాడు. మేలు జాతి విత్తనాలు నాటాడు. పొలం పనిలోనూ, కావలి పనిలోనూ కొరత చేయలేదు. కాని కోత సమయం దగ్గరపడగానే పంటకు వ్యాధి సోకి ఒక్క గింజ కూడా పండకుండా తాలు మాత్రమే మిగిలినట్లు గమనించాడు. అచ్చంగా ఇలాంటి పరిస్థితే సంకల్ప శుద్ధిలేని పనులదీనూ. చూడటానికి అవి పైకి ఎంతో మంచి పనులుగా కనిపించినా, వాటి వెనుక ఎంతోశ్రమ, ధన వ్యయం ఉన్నా సంకల్పం సరిగా లేని కారణాన పరలోకంలో వాటికి ఎలాంటి ప్రతిఫలం లభించదు. ఇహలోకంలోనే అతనికి లభించవలసిందేదో లభిస్తుంది. ఇతని స్థితి అచ్చం పంట కోసేటప్పుడు తాలు తప్ప మరేమీ చేతికి లభించని రైతులా ఉంది.

సోదరులారా!

ఇది మనమెంతో ఆలోచించవలసిన విషయం. మనమంతా సాధ్యమైన సత్కార్యాలన్నీ చెయ్యడానికి ప్రయత్నిస్తాం. వాటి కోసం సమయం, డబ్బు కూడా ఖర్చుపెడతాం. అయితే అప్పుడు మనం మన సంకల్పం ఎలా ఉందన్న విషయాన్ని

గురించి పరిశీలించుకోవడం ఎంతో అవసరం. లేకుంటే సంకల్పంలో ఏదయినా లోపం పొడసూపి దురదృష్టవశాత్తు మన కర్మలన్నీ వృధా కావచ్చు. మనం ఏ సత్కార్యం చేసినా దాని వెనుక దైవప్రీతి, పుణ్యం పొందే ఉద్దేశ్యం తప్ప మరేదీ ఉండకుండా ఎల్లప్పుడు జాగ్రత్తపడాలి. షైతాన్ మనిషికి పరమ శత్రువు. వాడు మనిషిని సన్మార్గానికి బదులుగా దుర్మార్గంలో పడవేయడానికే మొట్టమొదట ప్రయత్నిస్తాడు. అందులో విజయవంతం కాలేకపోతే, మానవుని సత్కర్మల్ని ఏ విధంగా వృధా చేయాలి అని పన్నాగాలు పన్నుతూ ఉంటాడు. దానికోసం వాడు ఎన్నుకున్న గట్టి మార్గం ఏమిటంటే మనం చేసే సత్కార్యాలకు మనలో రకరకాల చెడు ఉద్దేశ్యాలను పుట్టిస్తాడు. లోకులు చూసి గొప్ప భక్తుడు, పుణ్యాత్ముడని భావించాలన్న ఉద్దేశ్యంతో నమాజ్ చేసేలా మనల్ని షైతాన్ ప్రేరేపిస్తాడు. అలాగే మనం పేదలకు సహాయం, సంఘసేవ చేస్తున్నప్పుడు, "లోకులు నా దాతృత్వాన్ని గురించి చెప్పుకోవాలి, వారి హృదయాల్లో నా పట్ల గౌరవభావం కలగాలి; ఈ పేరు ప్రతిష్టలకు మూలంగా సంఘంలో నాకు మంచి స్థానం లభించాలి" అనే ఆలోచనల్ని మనలో వాడు కలిగింపజేస్తాడు. చివరికి ధర్మ సంస్థాపనం కోసం పాటుపడే హృదయాల్ని షైతాన్ తప్పుదోవ పట్టిస్తాడు. వారిలో కూడా అధికార పిపాస తప్ప మరే సదుద్దేశమూ మిగలకుండా చేస్తాడు.

సోదరులారా!

ఇది ఎంతో ప్రమాదకరమయిన స్థితి, అసలు ముస్లిమ్అనే వ్యక్తి మంచి పనులు కోరేవాడయి మాత్రమే ఉండాలి. అయితే అతను తన సంకల్పాన్ని గురించి అంతకంటే ఎక్కువ జాగ్రత్త వహించాలి. సంకల్పం సవ్యంగా లేని కారణంగా అతను చేసే సత్కర్మలన్నీ బూడిదలో పోసిన పన్నీరు కావచ్చు. దైవం ప్రసాదించే పుణ్యఫలం తప్ప గత్యంతరంలేని పరలోకంలో అతనికి ఏమీ దక్కక పోవచ్చు. పేరు ప్రతిష్ఠల పిపాస, ప్రదర్శనా వాంఛ మానవుని మనస్సులో అతనికి తెలియకుండానే చోటు చేసుకుంటాయి. అతను తన నోటితో ఎంతో మంచి మంచి మాటలు పలకవచ్చు. కాని లోకులు తనని మంచివాడని భావించాలన్న కోరిక తద్వారా తాను గొప్పవాడయిపోవాలన్న తపన అతని హృదయంలో తిష్ఠవేస్తాయి. ఆ విధంగా మనిషి చేసుకున్న సత్కార్యాలన్నీ వృధా అవుతాయి.

సోదరులారా!

అల్లాహ్ మనల్ని ఇలాంటి స్థితినుండి రక్షించాలని మనమంతా చిత్తశుద్ధితో దుఆ చేయాలి. ఇంకా మనం చేసే సత్కర్మల వెనుక దైవప్రీతి తప్ప మరే ఉద్దేశ్యమూ లేకుండా ఉండేలా ప్రయత్నించాలి.

# 2. పాపానికి నిష్కృతి పశ్చాత్తాపమే

మహాశయులారా!

మనలో పాపం చేయనివారెవరుంటారు? ఉదయం నుండి సాయంత్రం వరకు మనవల్ల ఎన్నో పాపాలు జరుగుతుంటాయి. అయితే పాపం జరిగిన ప్రతిసారీ పశ్చాత్తాపం చెంది దైవాన్ని క్షమాపణ వేడుకోవడం ముస్లిమ్ విధి. "విశ్వసించిన ప్రజలారా! మీరంతా అల్లాహ్ వైపునకు మరలి (మీ తప్పులకు) పశ్చాత్తాపపడండి. ఆ విధంగా మీరు సాఫల్యం పొందే అవకాశం ఉంది" అని దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ముస్లిములను ఆదేశిస్తున్నాడు. పశ్చాత్తాపం అనేది దాసుని లక్షణం. దేవుడు ఖుర్‌ఆన్‌లో మరో చోట ముస్లిమ్ గుణగణాలు వర్ణిస్తూ వారు "పశ్చాత్తాపం చెందే వారు" అని పేర్కొన్నాడు.

దీనివల్ల తెలిసేదేమిటంటే దాసుని వల్ల తప్పు జరగడం వింతేమీ కాదు. మానవుని వల్ల అనేక తప్పులు, పొరపాట్లు జరుగుతాయి. ఏమరపాటుకు లోనయి, షైతాన్ వలలో చిక్కుకుని అపమార్గం పడతాడు. అయితే అల్లాహ్‌ను విశ్వసించిన దాసుడు మాత్రం తన వల్ల తప్పు జరిగిందని గ్రహిస్తాడు. చేసిన తప్పుల్ని సమర్థించుకోవడానికి అడ్డదారులు వెతకకుండా అతను తక్షణమే పశ్చాత్తాప పడి దైవాన్ని వేడుకుంటాడు. దీన్నే 'తౌబా' అంటారు.

తౌబా అంటే మరలడం, వెనక్కి తిరిగి రావడం అనే అర్థాలున్నాయి. ఈ తౌబా మూడు షరతులపై ఆధారపడి ఉంది. ఒకటి, మానవుడు తాను చేసింది తప్పని మనస్ఫూర్తిగా ఒప్పుకోవాలి, సిగ్గుపడాలి. రెండు, వెంటనే ఆ తప్పుడు పనిని వదలిపెట్టాలి. మూడు, మళ్ళీ దాని జోలికి పోనని గట్టిగా నిర్ణయించుకోవాలి. తప్పుడు పనులకు అనుకూలంగా ప్రమాణాలు చూపెట్టే వారికి పశ్చాత్తాప భాగ్యం ఎన్నటికీ లభించదు. కొందరు ఒక వైపు తప్పు చేస్తూనే మరో వైపు పశ్చాత్తాపం కూడా చెందుతుంటారు. అలాంటి పశ్చాత్తాపానికి అర్థమే లేదు. అసలు పశ్చాత్తాపం అంటేనే చేస్తున్న తప్పుడు పనిని తక్షణమే మానేసి, ఇక ముందెప్పుడూ అలాంటి పనిని చేయనని మనసులో గట్టిగా నిర్ణయించుకోవడం.

సరే, ఇది దైవంతో సంబంధమున్న పాపాలను గురించిన విషయం. దాసులతో సంబంధమున్న పాపాలను గురించిన విషయం కూడా వినండి. ఉదాహరణకు ఒక వ్యక్తి ఎవరి హక్కయినా కాజేయడమో, లేదా ఎవరిపైనైనా అసత్య ఆరోపణ చేయడమో జరిగిందనుకోండి అలాంటి వ్యక్తి పాపం పోవాలంటే అతను చేసే తౌబాలోని పై మూడు షరతులతోపాటు మరో షరతు కూడా పాటించాలి. అతను ఎవరికి అన్యాయం చేశాడో

వారి దగ్గరకు పోయి క్షమాపణ పొందాలి; ఏదైనా హక్కు కాజేస్తే వారికి తిరిగి ఇచ్చివేయాలి.

సోదరులారా!

అల్లాహ్ మన పాపాలను, పొరపాట్లను క్షమిస్తున్నాడు. పాప పంకిలం నుండి బయల్పడి తన అనుగ్రహ ఛాయలో ఆశ్రయం పొందమని మాటిమాటికీ మనల్ని పిలుస్తున్నాడు. చూడండి, అల్లాహ్ మన పట్ల ఎంత దయామయుడో ఖుర్‌ఆన్‌లో ఆయన అనేక చోట్ల పశ్చాత్తాపం, మన్నింపులను గురించి బోధించాడు. ఆయనకు తన దాసుల పట్ల దయాదాక్షిణ్యాలే కాని విరోధం లేదు. ఆయన అనవసరంగా శిక్షించి సంతోషించడానికి మానవుల్ని సృష్టించలేదు. ఆయన అపార దయామయుడు. దయజూపడం, కనికరించడం ఆయన నైజం. దాసుడు ఎంత పెద్ద తప్పు చేసినా, చేసిన తప్పుల పట్ల సిగ్గుపడి అల్లాహ్ వైపునకు మరలితే అతడ్ని ఆయన తన సువిశాల అనుగ్రహఛాయలోనికి తీసుకుంటాడు. ఆయన తన సృష్టిజాలాన్ని ఎంతో అభిమానిస్తున్నాడు. హద్దులు మీరి దుర్మార్గంలో పడిపోయి దాన్ని విడిచి పెట్టని వారినే ఆయన శిక్షిస్తాడు.

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ అనుగ్రహాన్ని ప్రస్తావిస్తూ ఒకసారి ఓ మంచి ఉదాహరణ ద్వారా నచ్చజెప్పారు. ఆయన ఇలా అన్నారు, "మీలో ఎవరి ఒంటె అయినా నీళ్ళూ, జన సంచారం లేని (భయంకర) ఎడారిలో తప్పిపోయిందనుకోండి. అతను తాగే నీళ్ళు తినే ఆహారం కూడా ఆ ఒంటెపైనే ఉన్నాయనుకోండి. అప్పుడు ఆ వ్యక్తి ఒంటెకోసం వెతికి వెతికి నిరాశ చెందుతాడు. జీవితంపై విరక్తి కలిగి ఓ చెట్టు కింద పడుకుంటాడు. సరిగ్గా అలాంటి పరిస్థితిలోనే తప్పిపోయిన ఆ ఒంటె హఠాత్తుగా అతని ముందు నిల్చుంటుంది. అప్పుడతనికి ఎంత సంతోషం కలుగుతుందో అంతకంటే అనేక రెట్ల సంతోషం దైవానికి తన తప్పిపోయిన దాసుడు తిరిగి వచ్చినప్పుడు కలుగుతుంది." అంతకంటే ఆసక్తికరమయిన మరో ఉదాహరణ ఉంది. ఒకసారి దైవ ప్రవక్త (సఅసం) దగ్గరికి కొందరు యుద్ధ ఖైదీలను తీసుకొని రావడం జరిగింది. వారిలో ఒక మహిళ కూడా ఉంది. ఆమె పాలు తాగే పసిపిల్లవాడు ఎక్కడో తప్పిపోయాడు. ఆ కారణంగా ఆమె మాతృ హృదయం తల్లడిల్లసాగింది. పాపం ఆ మాతృమూర్తి ఏ పసిపిల్లవాడు కనిపించినా గుండెలకు హత్తుకొని పాలిస్తుండేది. దైవప్రవక్త (సఅసం) ఆమె పరిస్థితి చూసి సహచరులతో, "ఈ తల్లి తన బిడ్డను స్వయంగా తన చేతులతో అగ్నిలోకి విసిరివేస్తుందని మీరు ఊహించగలరా?" అని అడిగారు. దానికి వారు, "లేదు, అలా ఎన్నటికీ ఊహించలేము. స్వయంగా ఆమె విసిరివేయడం కాదుకదా, బిడ్డ తనంతట తాను నిప్పులో పడిపోవడం చూస్తే ఆ బిడ్డను కాపాడటంలో కూడా ఆమె ఏ మాత్రం కొరత చేయదు" అని పలికారు. అప్పుడు దైవ ప్రవక్త "ఈ స్త్రీకి తన

పిల్లవాడిపై ఎంత కనికరం ఉందో అల్లాహ్‌కు తన దాసులపై అంతకంటే ఎక్కువ కనికరం ఉంది" అన్నారు.

సోదరులారా!

మనం కాస్త ఆలోచిస్తే పిల్లల పెంపకం కోసం తల్లిదండ్రుల హృదయాల్లో ప్రేమాభిమానాలు కలిగించింది అసలు అల్లాహేనన్నది స్పష్టమవుతుంది. ఒకవేళ దైవం తల్లిదండ్రుల హృదయాలలో ఈ ప్రేమాభిమానాలు కలిగించకపోతే వారీ కష్టాలన్నీ ఎందుకు పడతారు? తమ సుఖ శాంతులు వదులుకొని ఇక్కట్లు ఎందుకు అనుభవిస్తారు? కనుక తల్లిదండ్రుల హృదయాలలో తమ సంతానం పట్ల ప్రేమాభిమానాలు ఉంచిన దేవుడు స్వయంగా తన సృష్టిజాలాన్ని మరెంతగా ప్రేమిస్తాడో దీన్ని బట్టి ప్రతివ్యక్తి అర్థం చేసుకోగలడు. దివ్యఖుర్‌ఆన్‌లో "ప్రజలారా! మీ ప్రభువుని వేడుకోండి. ఆయన వైపునకు మరలండి. నిస్సందేహంగా నా ప్రభువు కరుణామయుడు. ఆయన తన సృష్టిజాలాన్ని అభిమానిస్తున్నాడు" అని తెలియజేయబడింది.

సోదరులారా!

దాసుడు తన పాప క్షమాపణకై దైవం వైపునకు మరలడం అల్లాహ్‌కు ఎంత ఇష్టమో ఆలోచించండి. మరోవైపు "మానవులారా! మీ ప్రభువుని వేడుకోండి. ఆయన వైపునకు మరలండి. ఆయన కొంత కాలం వరకు మీకు మంచి జీవితావసరాలను ప్రసాదిస్తాడు" అని ఆయన తన దాసుల్ని పిలుస్తున్నాడు. దీనివల్ల తెలిసేదేమంటే పశ్చాత్తాపం చెందేవారిని అల్లాహ్ పరలోకంలో మాత్రమేగాక, ఇహలోకంలోనూ అనుగ్రహిస్తాడు. ఒకవేళ ఏదయినా ఓ జాతి ఇహలోకంలో తన భ్రష్ట వైఖరిని విడిచిపెట్టి దేవుని ఆదేశాలకు అనుగుణంగా తన జీవితాన్ని మలచుకుంటే ఆ జాతికి ఇహలోకంలోనూ దైవానుగ్రహం లభిస్తుంది. దాని జాతకంలో దేవుడు వినాశనం, శిక్షలకు బదులుగా బహుమానం, ప్రగతి, అభ్యున్నతుల్ని రాస్తాడు.

దేవుని కరుణా కటాక్షాలను మన వైపు మళ్ళించుకోవడానికి పశ్చాత్తాపం (తౌబా) ఒక్కటే అన్నిటికంటే మంచి మార్గం. ఒకసారి మహాప్రవక్త 'దైవసాక్షి! నేను రోజుకు డెబ్బయిసార్ల కన్నా ఎక్కువ దైవ మన్నింపును కోరుకుంటాను, పశ్చాత్తాపం చెందుతాను' అని తెలిపారు. మరొకసారి ఆయన, "ప్రజలారా! అల్లాహ్ సన్నిధిలో పశ్చాత్తాపం చెందండి; క్షమాపణ వేడుకోండి. నేను రోజుకు వందసార్లు పశ్చాత్తాపం పడతాను" అని ప్రబోధించారు.

అల్లాహ్ యొక్క క్షమాపణ అయన ఇతర గుణగణాలకు మాదిరిగానే అపరిమితమయినది. మానవుడు ఎన్ని తప్పులు చేసినా, అతని తప్పులు అంచనాక్కూడా అందనన్ని ఉన్నా సరే, అతను మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందితే అల్లాహ్ అతడ్ని క్షమిస్తాడు. అలాగే ఎంత మంది పాపాత్ములు తన వైపునకు మరలినా అల్లాహ్

వారందర్ని క్షమిస్తాడు. ఆయన క్షమాగుణం విస్తృతమయినది. ఈ విషయాన్ని వివరిస్తూ మహాప్రవక్త (సఅసం), "పగటివేళ పాపం చేసినవారు పశ్చాత్తాపం చెంది క్షమాపణ వేడుకోవడానికి అల్లాహ్ తన చేతిని రాత్రివేళ చాపుతాడు. రాత్రివేళ పాపం చేసినవారు పశ్చాత్తాపం చెంది క్షమాపణ వేడుకోవటానికి ఆయన తన చేతిని పగటివేళ చాపుతాడు" అని బోధించారు. పశ్చాత్తాప ద్వారం ప్రతి వ్యక్తి కోసం ప్రతి వేళా తెరువబడే ఉంటుంది. మరణ చిహ్నాలు కనిపించే వరకు ప్రతి వ్యక్తికీ దైవ మన్నింపు పొందే అవకాశం ఉంది. మరణ చిహ్నాలు కనిపిస్తే మాత్రం ఈ అవకాశం కాస్తా చేజారిపోతుంది.

సోదరులారా!

మనలో ప్రతి ఒక్కరూ మరణించవలసిందే. ఈ యదార్థం అందరికీ తెలుసు. కాని మరణం ఎప్పుడొస్తుందో ఎవరికీ తెలియదు. కనుక పశ్చాత్తాపం గురించి మనం క్షణంపాటు కూడా అశ్రద్ధ చేయకూడదు. పూర్తి స్పృహతో మాటిమాటికి పశ్చాత్తాపపడి దైవాన్ని వేడుకోవాలి. ఉదయం నుండి సాయంత్రం వరకు మనం చేసిన పనుల్ని గురించి ఆత్మ పరిశీలన చేసుకోవాలి; చేసిన తప్పుకు సిగ్గుపడాలి; పశ్చాత్తాపం చెందాలి. మనస్ఫూర్తిగా మన ప్రభువుని క్షమాపణ వేడుకోవాలి. ఇక నుండి ఇలాంటి తప్పులు చేయనని నిర్ణయించుకోవాలి. ఇలా ప్రతి రోజూ చేస్తుండాలి.

సోదరులారా!

మన పాపాల నిష్కృతికోసం పశ్చాత్తాపం చెంది క్షమాపణ అయితే వేడుకోవాల్సిందే. అయితే దాంతోపాటు "క్రియాత్మక పశ్చాత్తాపం" కూడా జరగాలి. అంటే క్షమాపణ వేడుకోవడంతోపాటు దైవ మార్గంలో కొంత ధనం ఖర్చుపెట్టాలి. మంచి వైపునకు మరలడానికి ఈ చర్య ఎంతో దోహదపడుతుంది. అల్లాహ్ అనుగ్రహంతో మనిషికి తన పరిస్థితిని మెరుగుపరచుకోవడంలో సౌలభ్యం కలుగుతుంది. "నిప్పును నీరు ఎలా ఆర్పి అంతం చేస్తుందో, అదే విధంగా దానం పాపాలను నిర్మూలిస్తుంద"ని మన ప్రియ ప్రవక్త (సఅసం) బోధించారు.

# 3. సహనం సజ్జనుల సొత్తు

మహాశయులారా!

సహనం ముస్లిమ్‌కు ఉండవలసిన ముఖ్యమైన గుణమని మీరు వినే వుంటారు. "సహనం వహించేవారికి దాని ప్రతిఫలం లెక్కలేనంతగా ఇవ్వబడుతుంద"ని ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ తెలియజేస్తున్నాడు. "అల్లాహ్ సహనం వహించేవారితో ఉన్నాడ"ని ఒకచోట ఉంది. "సహనపరులకు శుభవార్తను వినిపించమ"ని అల్లాహ్ తన ప్రవక్త (సఅసం)తో అన్నాడు. "అల్లాహ్ ఓర్పు వహించేవారితో మైత్రి చేస్తాడని" దివ్యఖుర్‌ఆన్ తెలుపుతోంది. అల్లాహ్ తన గ్రంథంలో, "వారికి వారు వహించిన సహనానికి ప్రతిఫలంగా అద్భుతమయిన మేడలు ప్రసాదించబడతాయ"ని శుభవార్త వినిపిస్తున్నాడు. వేరొక చోట ఖుర్‌ఆన్‌లో "ఆయన వారికి వారి సహనానికి ప్రతిఫలంగా స్వర్గాన్ని ప్రసాదించాడ"ని ఉంది. స్వర్గంలో దైవదూతలు విశ్వసించిన వారి దగ్గరకు వచ్చి "మీకు శాంతి కలుగుగాక, ప్రపంచంలో మీరు ఏ విధంగా సహనం వహించారో దానికి ప్రతిఫలంగా ఈ రోజు మీరు దీనికి (స్వర్గానికి) అర్హులయ్యారు" అని పలుకుతారు.

అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో, సహనం వహించాలని దైవ ప్రవక్త (సఅసం)కు, విశ్వసించిన వారికి మాటిమాటికి ఎలా తాకీదు చేశాడో చూడండి: "సహనం వహించండి, భయభక్తులు కలవారికే మంచి ప్రతిఫలం ఉంది. ఉత్తమోత్తమమైన రీతిలో ఓర్పు వహించు" అని ప్రబోధించాడు ఆయన.

ఇలా దివ్యఖుర్‌ఆన్‌లో సహనం గురించి అనేక ఆయత్‌లు వచ్చాయి. వీటిని బట్టి ముస్లిమ్‌లకు సహనం అలవర్చుకోవలసిన ఆవశ్యకత ఎంత ఉందో తెలుస్తోంది. అలాంటి సుగుణాన్ని అలవర్చుకోవాలని అల్లాహ్ మనల్ని ఆదేశిస్తున్నాడు. ఆ సుగుణాన్ని అలవర్చుకునేవారిని ఆయన ఎంతో అభిమానిస్తాడు; వారి కోసం పరలోకంలో గొప్ప పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాడు. కనుక సోదరులారా! ఇంతటి పుణ్యఫలాన్ని ఇవ్వగల ఈ సహనం యొక్క వాస్తవికత ఏమిటో కాస్త ఆలోచించండి. ఒకసారి మహాప్రవక్త (సఅసం), "సహనం కంటే ఎక్కువ మంచిది, లాభకరమయినది అయినటువంటి ఏ వస్తువూ ఎవరికీ ప్రసాదించబడలేద"ని అన్నారు, చూశారా! సహనం ఎంత గొప్ప పుణ్యకార్యమో! దానికింత గొప్ప ప్రతిఫలం ఎందుకివ్వబడుతుందో!!

సోదరులారా!

సహనాన్ని అరబ్బీ భాషలో 'సబ్ర్' అంటారు. ఈ పదానికి ఎంతో విస్తృతమయిన భావం ఉంది. మన భావోద్రేకాలను, మనో వాంఛలను అదుపులో పెట్టుకోవడమూ సహనమే. ఆత్రం, ఆవేశం, తొందరపాటుతనాలకు స్వస్తిచెప్పి ప్రవర్తించడమూ

సహనమే. భయప్రలోభాలు ఎదురయినప్పుడు నిజస్థానం వదలిపెట్టకుండా స్థిరంగా ఉండటమూ సహనమే. ప్రశాంతంగా ఆలోచించి తీసుకున్న సముచిత నిర్ణయంపై అమలు చేయడమూ సహనమే. ఎన్ని ఆపదలొచ్చినా, ఎన్ని ప్రమాదాలు ఎదురయినా సరే కదలని కొండలా స్థిరంగా ఉంటే అదీ సహనమే. కోపోద్రేకాలు వచ్చినప్పుడు వాటిని అణచిపెట్టుకోవడం కూడా సహనమే. ఆవేశం, ఉద్రేక సమయాల్లో తప్పుడు పని చేయకుండా ఉండటమన్నది కూడా సహనం కిందికే వస్తుంది. ఎలాంటి కష్టాలు వచ్చిపడినా, పరిస్థితులు మారిపోతున్న సూచనలు కనిపించినా ఆందోళన చెందకుండా ఉండటం కూడా సహనమే. ఏదయినా ఒక లక్ష్యాన్ని సాధించే ఉత్సాహంలో తొందరపాటు పడకపోవడం కూడా సహనమే.

ప్రాపంచిక ప్రయోజనాలు, మనోవాంఛలు, ఇంకా అలాంటివే రకరకాల విషయాలు మనిషి హృదయాన్ని కలవరపరుస్తాయి. అలాంటి సమయంలో పరిస్థితుల ప్రభావానికి కొట్టుకుపోయి తప్పుడు చర్యలు తీసుకోకుండా సరైన మార్గంపై స్థిరంగా ఉండాలి. అప్పుడు అదీ సహనమే అనిపించుకుంటుంది. దివ్యఖుర్ఆన్‌లో 'సబ్ర్' అనే పదం ఎక్కడెక్కడ ఏ విధంగా వాడబడిందో గమనిస్తే అందులో ఎంతో విస్తృతమైన భావం ఉన్నట్టు కనిపిస్తుంది, ఆలోచించండి! సహనం విషయంలో ఖుర్ఆన్ సూచించిన ఈ మొత్తం సందర్భాలలో ముస్లిమ్ తన మనస్సుని అదుపులో ఉంచుకొని ఏ విధమయిన తప్పుడు చర్యకూ పాల్పడకుండా ఉంటే ఇది గొప్ప సాహసకార్యమనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉదాహరణకు ఎవరైనా ఒకడు మనల్ని బాధ పెడుతున్నాడనుకోండి, తిరిగి అతడ్ని బాధ పెట్టగల శక్తి మనకూ ఉంటుంది. అయితే మనపై జరుగుతున్న ఈ దౌర్జన్యాన్ని మనం ఓర్చుకుంటే మన ప్రభువు సంతోషిస్తాడని భావించి ఆ వ్యక్తికి ప్రతీకారం చేయం. మనం చూపిన ఈ ఓర్పుకు ఎలాంటి ప్రతిఫలం లభించకుండా వృధా అవుతుందంటారా? ముమ్మాటికీ వృధాకాదు. అలాగే మనకు వ్యతిరేకంగా ఎవరయినా నిందారోపణలు చేస్తున్నారనుకోండి. అతను చేసిన పొరపాట్లు, తప్పుడు పనులు మనకు తెలుసు, వాటినిజనంలో ప్రచారం చేసి అతడ్ని కూడా అప్రతిష్టపాల్జెయ్యమని మన ఆంతరంగం అంటుంది; కాని అలా చేస్తే దైవప్రీతికి దూరమవుతామని మనం అలా చేయము. ఇలా మనోకాంక్షను అణచి ఉంచడం వల్ల మనకు మరో బాధకూడా కలుగుతుంది. దాన్ని కూడా మనం సహిస్తాం. ఇంత బాధను సహించిన మనకు ఎలాంటి ప్రతిఫలం లభించకపోవడం సమంజసమేనా?

మనిషిని ప్రతి చెడువైపునకు తీసుకెళ్ళేది అతని మనో వాంఛే అన్న విషయం మీకు తెలుసు. అంటే సహనం చెడుల్ని అరికట్టగలిగే ఓ మంచి సాధనం. దీన్ని ఉపయోగించుకోకపోతే సత్కార్యాలకు దూరమై చెడుల రొంపిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.